# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

ఆంధ్ర ప్రదేశ్ సంపుటి :02 సంచిక :159 పేజీలు ఎడిటర్ వి.శ్రీనివాసరావు గురువారం 28 ఆగస్టు 2025


## రాష్ట్రపతి, గవర్నర్ అధికారాల్లో కోర్టుల జోక్యం తగదు:

- బీజేపీ పాలిత రాష్ట్రాలు

-బిల్లుల వివాదంపై సుప్రీంలో బీజేపీ పాలిత రాష్ట్రాల వాదనలు

-గవర్నర్లు, రాష్ట్రపతిని కోర్టులు ఆదేశించలేవని వెల్లడి




## పాపాల భైరవుడు బీఆర్ నాయుడిని స్వామివారే తరిమికొడతారు:

- అంబటి రాంబాబు

-టీటీడీపై భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపణలు

-భూమనను తిరుపతి నుంచి తరిమికొట్టాలన్న టీటీడీ ఛైర్మన్

2



## బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం... ఏపీఎస్‌డీఎంఏ అలర్ట్

-బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం.. భారీ వర్ష సూచన

-తీవ్ర అల్పపీడనం ఒడిశా మీదుగా పయనించే అవకాశం

2



# భారత్‌పై సుంకాల భారం..

## అమెరికాకే ఎదురుదెబ్బ!



2

## భారత్ శాంతినే కోరుకుంటుంది..

# కానీ కవ్విస్తే ఊరుకోం

-భారత్ ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోదన్న రాజ్‌నాథ్ సింగ్

-కానీ కవ్విస్తే మాత్రం గట్టిగా బదులిస్తామని వెల్లడి

2

-ఇకపై టెక్నాలజీ, సైబర్ స్పేస్‌దే కీలక పాత్ర అన్న రక్షణ మంత్రి

-రక్షణ సన్నద్ధతను నిరంతరం మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య



భారత్ ఎన్నడూ యుద్ధాన్ని కోరుకోదని, ఏ దేశంపైనా దురాక్రమణకు పాల్పడలేదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. అయితే, దేశ సార్వభౌమత్వానికి ఎవరైనా సవాలు విసిరితే మాత్రం అత్యంత కఠినంగా, నిర్ణయాత్మకంగా బదులిస్తామని ఆయన గట్టిగా హెచ్చరించారు. మారుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు రక్షణ సన్నద్ధతను నిరంతరం మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు.
మధ్యప్రదేశ్‌లోని మౌలో ఉన్న ఆర్మీ వార్ కాలేజీలో బుధవారం జరిగిన 'రణ్-సంవాద్ 2025' త్రివిధ దళాల సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠి కూడా పాల్గొన్నారు.



2

# పెన్షన్లు తెచ్చింది మనమే... పెంచింది మనమే...

## వాళ్లకు మాట్లాడే అర్హతే లేదు:

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సంక్షేమానికి చిరునామా తెలుగుదేశం పార్టీయేనని, పింఛన్ల పథకాన్ని ప్రవేశపెట్టింది, దాన్ని దశలవారీగా పెంచుతూ వస్తున్నది కూడా తమ ప్రభుత్వాలేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పింఛన్ల విషయంలో విమర్శలు చేస్తున్న వైసీపీకి కనీసం మాట్లాడే అర్హత కూడా లేదని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మాట్లాడ్డానికే అర్హత లేని పార్టీ తమను విమర్శిస్తోందని మండిపడ్డారు. బుధవారం నాడు మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా పింఛన్లు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన పునరుద్ఘాటించారు.

**సంక్షేమ పాలనలో టీడీపీది చెరగని ముద్ర**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "సామాజిక భద్రతా పింఛన్లను రూ. 30 నుంచి ప్రారంభించి, నేడు రూ. 4000కు పెంచిన చరిత్ర తెలుగుదేశం పార్టీది. కేవలం వృద్ధాప్య పింఛన్లనే తీసుకుంటే, మేం పెంచిన మొత్తమే రూ. 2875 ఉంటుంది. దివ్యాంగుల విషయంలో గత ప్రభుత్వం రూపాయి కూడా పెంచలేదు.

## దొంగ ఓట్లతో గెలవలేదని నిరూపించుకోండి

- బండి సంజయ్‌కు మంత్రి పొన్నం సవాల్



## తెలంగాణలో వర్ష బీభత్సం...

# సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష



వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో విస్తారంగా వానలు పడతాయని, ఈ నేపథ్యంలో కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరోవైపు, సంగారెడ్డి, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి సహా పది జిల్లాలకు ఆరెంజ్, మిగిలిన జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. ఈ అల్పపీడనం రాగల 24 గంటల్లో ఒడిశా తీరం వైపు కదిలే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా శిథిలావస్థకు చేరిన, పురాతన ఇళ్లలో నివసిస్తున్న వారిని వెంటనే గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.హైదరాబాద్ నగరంలో హైడ్రా, ఎస్‌డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక, పోలీసు బృందాలు నిరంతరం అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. వినాయక చవితి ఉత్సవాల వేళ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో సిబ్బందికి సూచించారు. నదులు, వాగులపై ఉన్న లోతట్టు వంతెనల వద్ద ప్రవాహం ఎక్కువగా ఉంటే రాకపోకలను తక్షణమే నిలిపివేయాలని చెప్పారు.చెరువులు, కుంటలకు గండ్లు పడే ప్రమాదం ఉన్నందున నీటిపారుదల శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలని, అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖకు దిశానిర్దేశం చేశారు

# భారత్‌పై సుంకాల భారం.. అమెరికాకే ఎదురుదెబ్బ!

భారత్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఆ దేశానికే పెనుభారంగా మారుతోంది. భారత వస్తువులపై అదనపు సుంకాలు విధించడం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రముఖ ఆర్థిక నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ఈ చర్యల వల్ల అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగి, వృద్ధి రేటు పడిపోతుందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన నివేదికలో స్పష్టం చేసింది.

భారత్ నుంచి దిగుమతి అయ్యే కీలక వస్తువులపై బుధవారం నుంచి అదనంగా 25 శాతం సుంకాలను అమెరికా అమల్లోకి తెచ్చింది. ఇప్పటికే ఉన్న సుంకాలకు ఇది అదనం. "రష్యా ప్రభుత్వం నుంచి అమెరికాకు ముప్పు పొంచి ఉందన్న" కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) ఓ ముసాయిదా నోటిఫికేషన్‌లో పేర్కొనడం గమనార్హం. ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్ వంటి కొన్ని వస్తువులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు.

అయితే, ఈ సుంకాల ప్రభావం అమెరికా జీడీపీపై 40 నుంచి 50 బేసిస్ పాయింట్ల (0.4% – 0.5%) వరకు ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా వేసింది. సుంకాల కారణంగా దిగుమతుల ధరలు పెరిగి, డాలర్ బలహీనపడుతుందని నివేదిక వివరించింది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, గృహోపకరణాల వంటి రంగాలలో ధరలు విపరీతంగా పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

ఈ పరిణామాలను అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ కూడా ధ్రువీకరించారు. జాక్సన్ హోల్‌లో జరిగిన ఫెడ్ వార్షిక సదస్సులో ఆయన మాట్లాడుతూ.. "అధిక సుంకాల ప్రభావం ధరలపై ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది" అని వ్యాఖ్యానించారు.

ఇటీవలి గణాంకాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. జులై నెలలో అమెరికా టోకు ధరలు దాదాపు 1 శాతం పెరిగాయి. గత మూడేళ్లలో ఇదే అత్యంత వేగవంతమైన పెరుగుదల. ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్ (ఉత్పాదక ధరల సూచీ) గత ఏడాదితో పోలిస్తే 3.3 శాతం పెరిగింది. ఫర్నిచర్, దుస్తులు వంటి వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. సుంకాలను వెనక్కి తీసుకోకపోతే అమెరికన్ కుటుంబాల బడ్జెట్‌పై తీవ్ర ఒత్తిడి తప్పదని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# దొంగ ఓట్లతో గెలవలేదని నిరూపించుకోండి:

తెలంగాణలో బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతోనే గెలిచారన్న ఆరోపణలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. తాను నిజాయతీగా గెలిచానని భావిస్తే, తన నియోజకవర్గంలో ఓట్ల సరళిపై విచారణ జరపాలని ఎన్నికల కమిషన్‌ను కోరాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. దొంగ ఓట్లపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అనుమానం వ్యక్తం చేస్తే బండి సంజయ్ ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన పొన్నం, ఇటీవల కరీంనగర్‌లోని ఒకే ఇంట్లో 40 ఓట్లు బయటపడ్డాయని, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి బీజేపీ కుట్రలను బయటపెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

ఓట్ల కోసమే బీజేపీ దేవుడి పేరును, అక్షింతలను వాడుకుందని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. బండి సంజయ్‌ను బీజేపీ అధ్యక్ష పదవి నుంచి తొలగించినప్పుడు, ఒక బీసీ నేతకు అన్యాయం జరిగిందని తాము ఆయనకు మద్దతుగా నిలిచిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అదే బీజేపీ, మతం పేరు చెప్పి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును అడ్డుకోవడం దారుణమని ధ్వజమెత్తారు. "వెనుకబడిన ముస్లింలకు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో రిజర్వేషన్లు అమలవుతున్నాయి. దూదేకుల పేరుతో తెలంగాణ బీసీలకు అన్యాయం చేస్తే ఎలా?" అని బండి సంజయ్‌ను నిలదీశారు. కేంద్రం బీసీ బిల్లుపై నిర్ణయం తీసుకోకపోవడం వల్లే స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమవుతున్నాయని స్పష్టం చేశారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లులో మతపరమైన అంశాలు లేవని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకరే స్వయంగా చెప్పారని పొన్నం గుర్తు చేశారు. ఈ బిల్లుకు ఆమోదం లభించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాల్సిన బాధ్యత ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్‌లపై ఉందని అన్నారు. మరోవైపు, బీసీలకు అన్యాయం చేసేలా వ్యవహరిస్తున్న ఆర్. కృష్ణయ్య ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై కూడా పొన్నం విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ నగరానికి కేంద్రం నుంచి ఆయన ఒక్క రూపాయి అయినా నిధులు తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. మెట్రో విస్తరణకు అనుమతులు ఎందుకు తేలేకపోయారని నిలదీశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనూ హైదరాబాద్‌కు చుక్క నీరు కూడా అదనంగా తీసుకురాలేదని విమర్శించారు.

# పెన్షన్లు తెచ్చింది మనమే...
# పెంచింది మనమే...

వారి పింఛనును రూ. 500 నుంచి ఏకంగా రూ. 6000కు పెంచింది మా ప్రభుత్వమే. అలాగే డయాలసిస్ రోగులకు రూ. 10 వేలు, మంచానికే పరిమితమై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి రూ. 15 వేల వరకు ఆర్థిక సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మనది. రాష్ట్రవ్యాప్తంగా 63 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తున్నాం. దీనికోసం ఏటా సుమారు రూ. 35 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం" అని వివరించారు. ప్రజలకు ఇంత మేలు చేస్తున్నప్పుడు, ఈ వాస్తవాలను ప్రతి ఒక్కరికీ వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని ఆయన పిలుపునిచ్చారు.

అబద్ధాలను తిప్పికొట్టండి.. అర్హులకు అండగా నిలవండి

వైసీపీ కేవలం అబద్ధాల పునాదులపైనే రాజకీయం చేస్తుందని, వారు చేసిన తప్పులను ఇతరులపైకి నెట్టడంలో దిట్టలని చంద్రబాబు విమర్శించారు. "గత ప్రభుత్వ హయాంలో ఎంతోమంది అనర్హులకు పింఛన్లు ఇచ్చారు. దీనివల్ల నిజమైన అర్హులకు నష్టం జరుగుతోంది. అందుకే ఇప్పుడు అనర్హులను తొలగించి, ప్రతి అర్హుడికీ న్యాయం చేయాలని సంకల్పించాం. ఈ ప్రక్రియలో అధికార యంత్రాంగం ఏమైనా పొరపాట్లు చేస్తే, వాటిని గుర్తించి సరిదిద్దే బాధ్యతను పార్టీ యంత్రాంగం తీసుకోవాలి. ప్రభుత్వపరంగా నేను విధానాలు అమలు చేస్తాను, పార్టీ అధినేతగా మీ నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని లోపాలను సరిదిద్దుతాను. తాత్కాలిక సర్టిఫికెట్లు ఉన్నవారికి కూడా నోటీసులతో సంబంధం లేకుండా పింఛన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. ఏ ఒక్క అర్హుడూ నష్టపోకూడదన్నదే మా లక్ష్యం" అని ఆయన భరోసా ఇచ్చారు.

సూపర్ సిక్స్.. సూపర్ హిట్.. హామీలన్నీ అమలు చేస్తున్నాం

ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలను ప్రతి ఇంటికీ చేరవేసినట్లే, ఇప్పుడు ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను కూడా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. "చెప్పిన మాట ప్రకారం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ప్రక్రియ ప్రారంభించాం. ఎంతమంది పిల్లలున్నా ప్రతి తల్లికీ 'తల్లికి వందనం' అమలు చేస్తున్నాం. అన్న క్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ పథకాలను పునరుద్ధరించాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం. చేనేతలకు, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్, మత్స్యకారులకు వేట విరామ భృతిని రూ. 20 వేలకు పెంచాం. వీటన్నింటినీ ప్రజలకు వివరించాలి. సెప్టెంబర్ 6న అనంతపురంలో 'సూపర్–6 సూపర్ హిట్' పేరుతో భారీ సభ నిర్వహిస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు. గతంలో గొడవలు, దాడులతో ఉన్న వాతావరణాన్ని మార్చి, ఇప్పుడు అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించామని అన్నారు.

శాశ్వత రాజకీయాలే లక్ష్యం.. పార్టీ నిర్మాణంపై దృష్టి

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించిన కార్యకర్తలను, నేతలను చంద్రబాబు అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ఏ ఎన్నిక వచ్చినా కూటమే గెలవాలని ఆకాంక్షించారు. ప్రత్యర్థులు చిన్న తప్పును కూడా భూతద్దంలో చూపి దెబ్బతీయాలని చూస్తారని, అందుకే అందరూ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. త్వరలోనే జిల్లా కమిటీలను ప్రకటించి, రాష్ట్ర కమిటీ కూర్పుపై కసరత్తు చేస్తున్నామని వెల్లడించారు. "కొందరు తాత్కాలిక రాజకీయాలు చేసి ఇబ్బందులు పడతారు. మనం ప్రజల కోసం శాశ్వత రాజకీయాలు చేయాలి. అప్పుడే ప్రజల గుండెల్లో నిలిచిపోగలం. కష్టపడి పనిచేసే వారికే పార్టీలో పెద్దపీట వేస్తాం" అని ఆయన భవిష్యత్ కార్యాచరణను వివరించారు.

# చంద్రబాబు తన జీవితాన్ని కుప్పంకు అంకితం చేసిన ఆదర్శప్రాయుడు.

కుప్పం, ఆగస్టు 27( జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన జీవితాన్ని కుప్పంకు అంకితం చేసిన ఆదర్శప్రాయుడని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్, కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, చంద్రబాబు మిత్రుడు పి.ఎస్. మునిరత్నం అన్నారు. బుధవారం ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుప్పం ప్రాంతంలో ఎలాంటి శాశ్వత నీటి వనరులు లేవని, కుప్పం ప్రాంతం వర్షాధారం మీదనే ఆధారపడిందని పేర్కొన్నారు వర్షాలు కురిసి చెరువులు నిండితేనే వ్యవసాయం ముందుకు సాగేదని, తాగునీటి అవసరాలు తీరేదని అన్నారు. ఎక్కడో శ్రీశైలం వద్ద నుండి కృష్ణానది జలాలు కుప్పం చేరుకుందని ఆనందం వ్యక్తం చేశారు. కుప్పం నియోజకవర్గంలోని ప్రజలు రైతులు మహిళలు యువకులు అందరూ ఆనందానుభూతికి లోనయ్యారన్నారు. కుప్పం నియోజకవర్గంలో 1500 అడుగుల లోతుకు బోరు వేస్తే కూడా నీరు లభించే పరిస్థితులు ఉండేది కాదన్నారు. ప్రస్తుతం కృష్ణా జలాలు రావడంతో ఎన్నడు కనివిని ఎరుగని ఆనందంతో ప్రజలు ఉన్నారన్నారు. కృష్ణా జలాల రాకతో కుప్పం ప్రాంత ప్రజల కల సాకారమైందన్నారు. సకల జీవకోటికి ప్రాణదారం జలమేనని, అటువంటి జలం కుప్పం ప్రాంతంలో లేక కరువు కాటకాలతో ఇబ్బందులు పడే వారం అన్నారు. ఎవరికి సాధ్యం కానిది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టుదల కృషితో అపర భగీరధుడై కుప్పంకు కృష్ణమ్మ జలాలు తీసుకువచ్చారన్నారు. భవిష్యత్తు తరాలకు ఇది ఎంతో ఉపయోగకరమన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజల గుండెల్లో చంద్రబాబు నాయుడు చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. శ్రీశైలం మల్లన్న పాదాల నుంచి కుప్పం ప్రాంతం కంగుంది మల్లేశ్వర స్వామి వరకు కృష్ణమ్మ జలాలు పారే విధంగా చంద్రబాబు కృషి చేశారన్నారు. కుప్పం ప్రజలు జీవితాంతం చంద్రబాబును గుండెల్లో ఉంచుకుంటారన్నారు




## బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం...
# ఏపీఎస్‌డీఎంఏ అలర్ట్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడటంతో రానున్న రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) వెల్లడించింది. పండుగ సీజన్ కావడంతో, ముఖ్యంగా వినాయక చవితి మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక సూచనలు జారీ చేసింది. వర్షం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని సూచించింది.వాయవ్య బంగాళాఖాతంలో ఒడిశా తీరానికి సమీపంలో కేంద్రీకృతమై ఉన్న అల్పపీడనం, అదే ప్రాంతంలో తీవ్ర అల్పపీడనంగా మారిందని ఏపీఎస్‌డీఎంఏ తెలిపింది. ఇది పశ్చిమ–వాయవ్య దిశగా నెమ్మదిగా కదులుతోందని, రాబోయే 24 గంటల్లో ఒడిశా మీదుగా ప్రయాణించే అవకాశం ఉందని పేర్కొంది.ఈ తీవ్ర అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే సూచనలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

# పాపాల భైరవుడు బీఆర్ నాయుడిని స్వామివారే తరిమికొడతారు:

టీటీడీపై తీవ్ర ఆరోపణలు చేసిన వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డిపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన సంగతి తెలిసిందే. తప్పుడు ప్రచారం చేస్తున్న భూమనను తిరుపతి నుంచి తరిమికొట్టాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో వైసీపీ నేత అంబటి రాంబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. కరుణాకర రెడ్డిని తిరుపతి నుంచి తరిమి కొట్టడం ఎవరి వల్లా కాదని స్పష్టం చేశారు. కానీ... పాపాల భైరవుడు బీఆర్ నాయుడిని మాత్రం స్వామి వారే తరిమి కొడతారని అంబటి ట్వీట్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుపతిలో ముంతాజ్ హోటల్ కు భూ కేటాయింపుల వ్యవహారం వివాదం రూపుదాల్చింది. దీనిపైనే వైసీపీ నేతలకు, టీటీడీ ఛైర్మన్ కు మాటల యుద్ధం జరుగుతోంది

## రాష్ట్రపతి, గవర్నర్ అధికారాల్లో
# కోర్టుల జోక్యం తగదు:

రాష్ట్రపతి, గవర్నర్ అధికారాల్లో కోర్టుల జోక్యం తగదని బీజేపీ పాలిత రాష్ట్రాలు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించాయి. శాసనసభలు పంపించిన బిల్లుల ఆమోదానికి తనకు గడువును నిర్దేశించడంపై పలు ప్రశ్నలు సంధిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టు అభిప్రాయం కోరిన విషయం తెలిసిందే. ఈ విషయంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టింది.

ఈ క్రమంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, గోవా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు ధర్మాసనం ముందు తమ వాదనలు వినిపించాయి. అసెంబ్లీలు ఆమోదించి పంపిన బిల్లుల విషయంలో నిర్ణయం తీసుకునే అధికారం ఆయా రాష్ట్రాల గవర్నర్లు, రాష్ట్రపతిదేనని మహారాష్ట్ర తరఫున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే రాజ్యాంగ ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు.

రాజ్యాంగం ప్రకారం.. బిల్లులకు సమ్మతి తెలపడం, తిరస్కరించడం లేదా వాటిని తమ వద్దే నిలిపి ఉంచుకునే అధికారం రాష్ట్రపతి, గవర్నర్లకు మాత్రమే ఉంటుందని సాల్వే పేర్కొన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం న్యాయస్థానాలకు లేదని, న్యాయస్థానాలు తమంతట తాముగా రాజ్యాంగాన్ని మార్చలేవని ఆయన స్పష్టం చేశారు. బిల్లుల ఆమోదం విషయంలో గడువు విధించడం సబబు కాదని, ఆ అధికారం కోర్టులకు లేదని అన్నారు.

రాజకీయ సంప్రదింపుల తర్వాత గవర్నర్లు, రాష్ట్రపతి ఆ బిల్లులపై నిర్ణయం తీసుకుంటారని, దీనికి నిర్ణీత గడువు అంటూ ఏదీ లేదని చెప్పారు. ఆర్థిక బిల్లులను కూడా నిరవధికంగా నిలిపివేస్తే పరిస్థితి ఏంటని ధర్మాసనం ప్రశ్నించగా.. ఆర్థిక బిల్లుల ఆమోదానికి ప్రత్యేక పద్ధతి ఉందని హరీశ్ సాల్వే తెలిపారు. కాగా, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ ఆధ్వర్యంలోని ఈ రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు

## భారత్ శాంతినే కోరుకుంటుంది..
# కానీ కవ్విస్తే ఊరుకోం

ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, "భారతదేశం శాంతి కాముక దేశమని, మేం ఎప్పుడూ యుద్ధాన్ని ప్రారంభించలేదు. అయితే ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. మాకు దురాక్రమణ ఆలోచన లేనప్పటికీ, ఎవరైనా మమ్మల్ని సవాలు చేస్తే, బలంతో స్పందించడం తప్పనిసరి అవుతుంది" అని అన్నారు.ఆధునిక కాలంలో యుద్ధాల స్వరూపం వేగంగా మారిపోతోందని రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. కేవలం సైనికుల సంఖ్య లేదా ఆయుధాల నిల్వలు మాత్రమే విజయాన్ని నిర్ధారించలేవని స్పష్టం చేశారు. "సైబర్ వార్‌ఫేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్లు, ఉపగ్రహ ఆధారిత నిఘా భవిష్యత్ యుద్ధాలను నిర్దేశిస్తాయి. ఇకపై యుద్ధాలు భూమి, సముద్రం, గగనతలంతో పాటు అంతరిక్షం, సైబర్‌స్పేస్‌లో కూడా జరుగుతాయి" అని ఆయన వివరించారు.భవిష్యత్ యుద్ధాలు కేవలం ఆయుధాలతోనే కాకుండా టెక్నాలజీ, నిఘా, ఆర్థిక వ్యవస్థ, దౌత్యం కలయికతో జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. సాంకేతికత, వ్యూహం, పరిస్థితులకు అనుగుణంగా మారే సామర్థ్యం ఉన్న దేశమే ప్రపంచ శక్తిగా ఎదుగుతుందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

# బ్రహ్మంగారిమఠంలో ఎంపీ అవినాష్ రెడ్డి గారి జన్మదిన వేడుకలు..

బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి( శుభోదయం న్యూస్): బ్రహ్మంగారిమఠం మండలంలోని రెడ్డి గారి సత్రం నందు పార్లమెంట్ సభ్యులు ఎంపీ అవినాష్ రెడ్డి గారికి జన్మదిన వేడుకలు మఠం వైయస్సార్సీపి కార్యకర్తలు మరియు ప్రజలు ఘనంగా జరుపుకోవడం జరిగింది . ఈ వేడుకల్లో ఎంపీటీసీ మనోహరాచారి ,బద్దెల శ్యాంసుందర్ రెడ్డి, వైయస్ సుబ్బారెడ్డి, పసుపులేటి వెంకటేష్, బాలకృష్ణారెడ్డి, బండి సుబ్బరాజు, మత్స్య సంఘ అధ్యక్షుడు సోమయ్య, .రవి కుమార్ రెడ్డి, .సుబ్బారెడ్డి, ప్రభాస్, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, తిప్పన నాగార్జున గురుమూర్తి మల్లికార్జున రెడ్డి, గురువిరెడ్డి బ్రదర్స్, మొదలైన నాయకులు పాల్గొని ఈ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.



# భారీ వర్షంతో..జలదిగ్బంధంలో చిక్కుకున్న రామాయంపేట పట్టణం

రామాయంపేట (శుభోదయం న్యూస్) ఆగస్టు 27: మెదక్ జిల్లా రామాయంపేట మండలంలో గత



మంగళవారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు రామాయంపేట పట్టణ సమీపంలోని మెదక్ సిద్దిపేట దౌల్తాబాద్ వెళ్లే ప్రధాన రహదారి చౌరస్తా వద్ద భారీగా నీరు చేరడంతో వాహనాలు నిలిచిపోయాయి.నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో కొంత రోడ్డు కొట్టుకుపోయింది.ఆ రహదారి గుండా వెళ్లే వాహనాలు పూర్తిగా నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.ఎస్సీ బాలికల వసతి గృహంలోకి ఒక్కసారిగా వరద నీరు చేరడంతో అప్రమత్తమైన అధికారులు వసతి గృహంలో ఉన్న 80 మంది విద్యార్థినులను సమీపంలోని వివేకానంద పాఠశాలకు తరలించారు.భారీ వర్షంతో అక్కల బస్తి,బీసీ కాలనీ,రెడ్డి కాలనీ,శ్రీనగర్ కాలనీతో పాటు పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకోనిపోయి జనజీవనం అస్తవ్యస్తంగా మారిపోయింది.కామారెడ్డి ప్రధాన రహదారి పాత హైవే పెట్రోల్ పంప్ వద్ద రోడ్డుపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు ఎక్కడికక్కడే నిలచిపోయాయి.మెదక్ సిద్దిపేట కామారెడ్డి హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయాణికులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అదే మల్లెచెరువులోకి నీరు ఉధృతంగా చేరడంతో రెడ్డి కాలనీ నివాస గృహాలు వాహనాలు నీటిలో మునిగిపోయి,ప్రజలు పూర్తిగా బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.ఈ భారీ వర్షాలకు చెరువులు కుంటలు ప్రమాదకరంగా మారి అలుగులు పొంగిపొర్లుతున్నాయి.ప్రధాన రహదారి నుండి తండాలకు వెళ్లే రహదారులు కూడా ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.మండలంలో ఉన్న చెరువులు కుంటలు ఈ భారీ వర్షాలకు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.భారీ వర్షానికి మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్ భవనం చుట్టుపక్కల భారీగా వరద నీరు చేరడంతో 350 మంది హాస్టల్ విద్యార్థినులు నీటిలో చిక్కుకుపోయారు.విద్యార్థులు పూర్తిగా బయటికి రాలేని పరిస్థితి ఏర్పడింది.విద్యార్థులను బయటకు తీసేకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.రామాయంపేట పట్టణ,మండల ప్రజలకు అధికారులు తెలియజెయడం ఏమనగా గ్రామాలలో పట్టణం కాలనీల్లో పాత ఇండ్లలో



నివాసం ఉండే ప్రజలు కూలిపోయే ప్రమాదం ఉన్నందున,అలాగే ఇండ్లలోకి నీరు వచ్చి ఉండడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న వారు అధికారులకు వెంటనే సమాచారం అందిస్తే ఉండడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు.రైతులు వ్యవసాయ మోటార్లు స్టార్టర్లు మునిగిన పంటపొలాలు,చెరువు అలుగులు,వరద ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తగా వహించాలన్నారు.విద్యుత్ వైర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,వినాయక మండపాల వద్ద ఇనుప రేకులు కాకుండా టార్పాలిన్ కవర్లతో మండపం ఏర్పాటు చేసుకొని,విద్యుత్ వైర్ల పట్ల నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.కావున ప్రజలు అవసరాల నిమిత్తమే బయటకు రావాలని లేనియెడల రావద్దన్నారు.రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు ఉన్న కారణంగా ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలన్నారు.అత్యవసరం అయితే ప్రజలు పోలీసు వారికి 100 నెంబర్ కు డయల్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

# కడప ఎంపీ అవినాష్ రెడ్డి గారి జన్మదిన వేడుకలను నిర్వహించిన.... బద్వేల్ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి

బద్వేల్ నియోజకవర్గం ప్రతినిధి రిపోర్టర్ – శివారెడ్డి (శుభోదయం న్యూస్): కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గంలో కడప పార్లమెంట్ సభ్యులు గౌరవనీయులు శ్రీ వైఎస్ అవినాష్ రెడ్డి గారి పుట్టినరోజుని పురస్కరించుకునిఅమగంపల్లి గ్రామ సమీపములో గల బాలమ్మ వృద్ధాశ్రమంలో బద్వేల్ నియోజకవర్గ వైయస్ఆర్సీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి కేక్ కట్ చేసి అవినాష్ రెడ్డి గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ముఖ్యంగా మన బద్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన కృషి అమోఘంగోపవరం లో సెంచరీ ఫ్యాక్టరీ స్థాపన కోడికొండ మేదరమెట్ట ప్రాంతం మీదుగా నేషనల్ హైవే ఏర్పాటుచేయడంఆర్డిఓ కార్యాలయాన్ని రాజంపేట నుండి బద్వేల్‌కు తీసుకురావడం 100 కోట్ల నిధులతో లింక్ రోడ్ల ఏర్పాటు బద్వేల్ మున్సిపాలిటీకి 130 కోట్ల నిధులతో డ్రైనేజ్, సిసి రోడ్ల నిర్మాణం 50 కోట్లతో కలసపాడు కాశినాయన మండలాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ పనులను అందులో కలసపాడు మండలం యొక్క లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయడం జరిగినది. కొంతమేర కాశినాయన మండల లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి కావలసి ఉన్నవి.వందలాది దేవాలయాల పునర్నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించడం
అభివృద్ధి పనులకే కాక, వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి సైతం వెంటనే స్పందించి ప్రజలకు సేవలందించే అరుదైన ప్రజానాయకుడు అవినాష్



రెడ్డి ఇలాంటి జననేత జన్మదిన వేడుకల్లో పాల్గొనడం నాకు నిజమైన గౌరవంగా భావిస్తున్నాను.
మన అవినాష్ రెడ్డి నిండు నూరేళ్ల ఆరోగ్యంతో, సుఖసంతోషాలతో ప్రజాసేవలో నిలిచిపోవాలని మనసారా భగవంతుడిని ప్రార్థిస్తున్నామని తెలియచేయడం జరిగినది.

## ధర్మాజీగూడెం గ్రామం

# నిర్లక్ష్యానికి బలైన ప్రజలు

ఏలూరు జిల్లా ప్రతినిధి – ప్రసాద్ (శుభోదయం న్యూస్ ): ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గంలోని లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామం ఈరోజు చాలా దారుణ స్థితిలో ఉంది. పరిశుభ్రత అనే మాటనే మర్చిపోయినట్లుగా ఉంది. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. మురికి నీరు కాలువల్లో నిల్వ ఉండి దోమల వ్యాప్తి పెరుగుతోంది. పౌరులు ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం రోజురోజుకు పెరుగుతోంది.
గ్రామ రహదారుల పరిస్థితి కూడా అత్యంత దయనీయంగా ఉంది. వర్షం పడితే మట్టి రోడ్లు బురదమయమై నడవటానికే వీలు లేకుండా మారిపోతాయి. వాహనాలు నడపడం చాలా కష్టసాధ్యమైపోతోంది. పాఠశాలకు వెళ్లే పిల్లలు, పనుల కోసం బయటకు వెళ్లే కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
గ్రామ ప్రజలు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా వినిపించుకునే వారెవ్వరూ లేరు. ఎక్కడో ఎప్పుడో ఒకసారి వస్తే ఫోటోలు తీసి వెళ్ళిపోతారు కాని శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడంలేదు.

**ప్రజల సమస్యలు:**

చెత్త నిర్వహణ లేకపోవడం
తాగునీరు, డ్రైనేజ్ సదుపాయం లేకపోవడం
పక్కా రహదారుల కొరత
ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి

ధర్మాజీగూడెం ప్రజలు ప్రాథమిక సౌకర్యాలు కోరుకోవడం పెద్ద కోరిక కాదు. పరిశుభ్రమైన వాతావరణం, రహదారులు, మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వపు బాధ్యత. కానీ ఈ బాధ్యతను నిర్వర్తించకపోవడం ప్రజల జీవితాలను కష్టాల్లోకి నెట్టేస్తోంది.



అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ గ్రామ స్థితిని గమనించి తక్షణమే చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగే పరిస్థితులు ఏర్పడవచ్చునని గ్రామస్తులు హర్షధ్వానాలు వ్యక్త పరుస్తున్నారు.

# శ్రీ శ్రీ శ్రీ దప్పిలేశ్వరి అమ్మవారి సన్నిధిలో శ్రీ వరసిద్ధి వినాయక చవితి వేడుకలు

బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ – శివారెడ్డి (శుభోదయం న్యూస్): బద్వేర్ పట్టణంలోని నక్కల గండి సమీపంలో వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ దప్పిలేశ్వరి అమ్మవారి సన్నిధిలో వినాయక చవితి సందర్భంగా శ్రీ సాయి వసుధ ట్రస్ట్ చైర్మన్ వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వినాయక చవితి పండగ సందర్భంగా అమ్మవారికి, గణపతికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు హోమాలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయకుడిని భక్తితో పూజిస్తే తలపెట్టిన ఏ కార్యంలో అయినా ఆటంకాలు, ఇబ్బందులు లేకుండా విజయం సాధిస్తారని నమ్మకం. అందుకే గణేష్ చతుర్థి పండుగ రోజు విఘ్నహర్త అయిన వినాయకుడి పూజ ఘనంగా చేస్తారు. ప్రతి ఏడాది భాద్రపద మాసంలో వినాయక చవితి పండుగ వస్తుంది. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో మీరు చేపట్టే ప్రతి పనిలో విజయం సాధించాలని మనసారా కోరుకుంటున్నాను అని తెలిపారుగణనాథుడిని భక్తి, శ్రద్ధలతో నవరాత్రులు ప్రత్యేకంగా పూజిస్తారు. విఘ్నాలను తొలగించి మము కాపాడు రామయ్య అంటూ గణనాధుని పూజించడానికి భక్తులు సిద్ధమవుతున్నారు అలాగే ఇక్కడి శనీశ్వరుడు శివలింగానికి మరియు పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో కడపకు చెందిన రవిశంకర్, నిమ్మకాయల రామచంద్రారెడ్డి లక్ష్మీదేవి న్యాయవాది కృష్ణ, ట్రస్ట్ మేనేజర్ ఆరిఫ్, అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.





# గ్రామపంచాయతీ సిబ్బందికి నిత్యవసర సరుకుల పంపిణీ

### -బిజెపి రాష్ట్ర నాయకులు పీవీ శ్యాంసుందర్రావు జన్మదినం సందర్భంగా

వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు పి ఆర్ ఫౌండేషన్ అధినేత పి వి శ్యామ్ సుందర్ రావు జన్మదినోత్సవం సందర్భంగా వలిగొండ మండలగ్రామపంచాయతీ సిబ్బందికి నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు రాచకొండ కృష్ణ హాజరై వారు మాట్లాడుతూ శ్యామ్ సుందర్ రావు పి ఆర్ ఫౌండేషన్ స్థాపించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆపదలో ఉన్న పేదల కొరకు సహాయం చేయడం,భారతీయ జనతా పార్టీ బలోపేతానికి జిల్లాలో కృషి చేయడం జిల్లాలోని పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లను కూడా బహుకరించడం జరిగినది,వారి జన్మదినోత్సవ సందర్భంగా పి వి శ్యామ్ సుందర్ రావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదలను ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మైసొల్ల మచ్చ గిరి,వార్డ్ మెంబర్ దోగుపర్తి సంతోష్, బీజేవైఎం జిల్లా నాయకులు రేగురీ అమరేందర్,బర్ల మల్లేశం,ఎర్రబోలు జంగయ్య,ఎల్లంకి మురళిగ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# భూ పోరాట యోధులు శ్రీశైలం

### -ఎన్డీ జిల్లా నాయకులు ఖాసీం విప్లవ కుమార్

కొణిజర్ల, ఆగస్టు 27, రిపోర్టర్ – నవీన్ (శుభోదయం న్యూస్) : నిర్బంధాన్ని,చిత్రహింసలను ఎదుర్కొని పోడు భూములను నరికించి పేదలకు పంచిన ఘనత దివంగత నేత పొట్లపల్లి శ్రీశైలంకు దక్కుతుందని సీపీఐ (ఎంఎల్–న్యూడెమోక్రసీ) జిల్లా నాయకులు షేక్ ఖాసీం, పొట్లపల్లి విప్లవ కుమార్ పేర్కొన్నారు మండల పరిధిలోని రామనరసయ్య నగర్ గ్రామంలో పొట్లపల్లి శ్రీశైలం 4వ వర్ధంతి సభ ఆంగోత్ భాషా అధ్యక్షతన బుధవారం జరిగింది తొలుత శ్రీశైలం చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించి స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు అనంతరం జరిగిన కార్యక్రమంలో ఇరువురు మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నాడు చిత్రహింసలు జైలు జీవితం అణిచివేతను ఎదుర్కొని పార్టీ అభివృద్ధికి జీవిత చమరాంకం వరకు కృషి చేసిన మహనీయుడు అన్నారు అమరుడు కామ్రేడ్ శ్రీశైలం స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని యూరియా కొత్త నివారించి రైతులకు అవసరమైన మేరకు యూరియాను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు తుఫాన్ భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు సర్వే చేసి నష్ట పరిహారం ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు చల్ల ఉపేందర్భూక్యాశంకర్ ఖాసింఖాన్, ఆంగోత్ దస్రు, తడికమళ్ళ సీతయ్య, బంటు లచ్చన్న, తదితరులు పాల్గొన్నారు



# ప్రజల రక్షణలో మహిళా శక్తి ముందంజ

### -వ్యక్తిగతంగా పర్యవేక్షించిన అల్లాదుర్గ్ సీఐ శ్రీమతి రేణుక రెడ్డి





మెదక్ జిల్లా, (శుభోదయం న్యూస్): మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా మండల కేంద్రంలో వరద ముప్పు ఏర్పడింది.ఈ పరిస్థితిని వ్యక్తిగతంగా పర్యవేక్షించిన అల్లాదుర్గ్ సీ.ఐ రేణుక రెడ్డి తమ సిబ్బందితో కలిసి సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొన్నారు.వరదలో ఇరుక్కున్న ప్రజలను రక్షించి సురక్షిత ప్రదేశాలకు తరలించడం వర్షం కారణంగా అడ్డంకిగా మారిన దారులను శుభ్రం చేయించడం అత్యవసర సహాయం అందించడం వంటి పనులను ఆమె బృందం చెప్పటింది. శీశీశీశీఈ సందర్భంగా సీ.ఐ రేణుక రెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రాణభద్రతే మా ప్రధాన లక్ష్యం. ఎవరూ వాగులు వంకలు దాటే ప్రయత్నం చేయకూడదు.అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలి.మహిళలు కూడా ఎలాంటి కఠిన పరిస్థితుల్లోనైనా ముందుండి సేవ చేయగలరని అన్నారు.

# విఘ్నేశ్వర సేవ దళం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుక

పిడుగురాళ్ల, టౌన్ రిపోర్టర్ – శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): వినాయక చవితి సందర్భంగా ఏడు కోట్ల సెంటర్లో విఘ్నేశ్వర సేవ దళం వారు నిర్వహిస్తున్న కార్యక్రమానికి కనిగిరి శ్రీనివాసరావు గారి అద్వర్యంలో మన ఎమ్మెల్యే శ్రీ గౌరవనీయులైన యరపతినేని శ్రీనివాసరావు గారిని ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు కనిగిరి శ్రీనివాసరావు, కొత్త చిన సుబ్బారావు, కొత్త సాంబశివరావు (వనజ), మద్దాలి సుబ్బయ్య, కొత్త కోటి, కొత్త రమణ, నీరుమళ్ల సత్యం, ఆతుకూరి వివేక్, వెచ్చ అజిత్, గోంట్ల శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆధ్వర్యంలో రోడ్లకు రాచబాట



ఏలూరు జిల్లా ప్రతినిధి -ప్రసాద్ (శుభోదయం న్యూస్): ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలో
గత ఐదేళ్ల కాలంలో రహదారి నిర్మాణ పనులు కాదు కనీసం మరమ్మతు పనులు కూడా చేపట్టక పోవడంతో చింతలపూడి మండలంలోని రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి.
ఎక్కడ చూసినా పెద్ద పెద్ద గుంతలు గతుకుల రోడ్లే వాహనదారులకు దర్శనమిచ్చేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే రోషన్ కుమార్ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు.జిల్లాలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో నూతన రహదారుల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి.ముఖ్యంగా నియోజకవర్గ హెడ్ క్వార్టర్ చింతలపూడిలో గుంతలు లేని రోడ్లను నిర్మించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారు.గుత్తేదారులకు భరోసా కల్పిస్తూ మీరు పనులు చేపట్టండి.నిధుల కొరత లేకుండా చూస్తా అని హామీ ఇవ్వడంతో నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే అత్యంత దారుణమైన గోతులు ఏర్పడి పలువురు ప్రాణాలను హరించిన రేచర్ల ప్రధాన రహదారి ని సిసి రహదారిగా మార్చి అభివృద్ధి చేశారు.బోయ గూడెం నుంచి రేచర్ల గ్రీన్ ఫీల్డ్ రహదారి వరకు ఐదు కిలోమీటర్ల రహదారిని నాలుగు కోట్లతో నిర్మించి పూర్తి చేశారు.రేచర్ల నుంచి ఎర్రగుంటపల్లి వరకు నూతన రహదారి పనులు ఇప్పటికే ప్రారంభమై జోరుగా సాగుతున్నాయి.ఎర్రగుంటపల్లి నుంచి మక్కిన వారి గూడెం వరకు నూతన రహదారి పనులు మూడు కోట్లతో వేగంగా చేపడుతున్నారు.చింతలపూడి నుంచి రాఘవపురం వరకు రహదారి నిర్మాణ పనులు ప్రారంభమై కాంట్రాక్టర్ వేగంగా చేపడుతున్నారు.
టీ. నర్సాపురం వెళ్లే రహదారిని రెండు కోట్లతో టెండర్ కూడా పూర్తి చేశారు. మరో 10 రోజుల్లో ఈ రహదారి నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయి మరో నెల రోజుల్లో మండలంలోని రహదారులు అద్దంలా మారనున్నాయి.
జిల్లాలో ఏ నియోజకవర్గంలో జరగని విధంగా చింతలపూడి లో నూతన రహదారి నిర్మాణ పనులు ఎంతో వేగంగా చేపడుతున్నారు. దీనికి ముఖ్య కారణం ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు సచివాలయంలోని ఆయా మంత్రులను, కార్యదర్శులను తరచూ కలుస్తూ రహదారులపై విన్నవిస్తుండడంతో ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తున్నారు.ఏదేమైనా కూటమిపరిపాలనపై నియోజకవర్గ ప్రజలు హర్షధ్వానాలు వ్యక్త పరుస్తున్నారు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై ఇలాగే ఎమ్మెల్యే రోషన్ కుమార్ ముందుకు సాగాలని ప్రజలు కోరుకుంటున్నాను.

# డి.వడ్డిపల్లిలో అంగరంగ వైభవంగా వినాయక చవితి వేడుకలు

వెంకటగిరి నియోజకవర్గం ఇంచార్జ్ - విసీ సుబ్బరాయుడు (శుభోదయం న్యూస్): తిరుపతి జిల్లా డక్కిలి మండలం డి.వడ్డిపల్లి గ్రామపంచాయతీ నందు వినాయక చవితి సందర్భంగా వినాయక స్వామివారి ప్రత్యేక పూజలు గణపతి హోమము శాస్త్రోకంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ పెద్దలు వేపమాన యువరాజు,వేపమాను రాములు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా పురస్కరించుకొని గ్రామ ప్రజలు అందరూ ఆయురారోగ్యాలు ఐశ్వర్యాలు వినాయక స్వామి అనుగ్రహంతో కలగాలని అన్నారు వినాయక చవితికి సహకరించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ట దాత వెలికంటి చెంచయ్య కు అదేవిధంగా డీజే సౌండ్స్ సంబంధించిన స్పీకర్ బాక్సులు గాను దాదాపు 5,20,000 రూపాయలు విరాళంగా అందించిన (డి.వడ్డిపల్లి యూత్ వారియర్స్ గ్రూపు) వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు స్వామివారికి మూడు రోజులు గాను ప్రతిరోజు అన్నదానం నిర్వహిస్తూఉన్న దాతలు



పేర్లు బుధవారం ఉదయం స్వామి వారి విగ్రహ ప్రతిష్ట దాత వెలికంటి చెంచయ్య 400 మందికి బుధవారం సాయంత్రం అన్నదానం 500 మందికి నిర్వహించిన బత్తల వెంకటరమణ, నరేష్,చక్రవర్తి గురువారం అన్నదాన కార్యక్రమం 300 మందికి నిర్వహిస్తున్న బసవయ్య గారి మహేంద్ర అదేవిధంగ



ఎస్ వి ఎస్ స్టార్ గ్రూప్ 300 మందికి అన్నదాన కార్యక్రమం సాయంత్రం వేముల శంకరయ్య (లేట్ )కుమారుడు శివకుమార్ 350 మందికి అన్నదాన కార్యక్రమం శుక్రవారం బండారు చిన్న వెంకటయ్య కుమారులు శ్రీనివాసులు, వెంకటరమణ 1000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరికి గ్రామ పెద్దలు ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## బాపట్ల పట్టణంలో జర్నలిస్టు మిత్రుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నిర్వహించిన వినాయక చవితి పండుగ



బాపట్ల పట్టణం, (శుభోదయం న్యూస్) ఆగస్టు 27 : పర్యావరణ పరిరక్షణకే ప్రాధాన్యం ఇస్తూ ఎటువంటి రసాయన పదార్థాలు వాడకుండా పూర్తిగా బంకమట్టితో తయారైన ఐదు అడుగుల వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారుఈ పర్యావరణ హితం కార్యక్రమం బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలోని రెడ్ క్రాస్ భవన ప్రాంగణంలో జరిగింది ఈ సందర్భంగా జర్నలిస్టులు ప్రకృతి సంరక్షణ మట్టి వినాయకుల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రజలు కూడా ఇలాంటి వాటిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారుపండుగలో భక్తి, ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ చైతన్యం ప్రతిబింబించి ఒక విశిష్ట వాతావరణం నెలకొంది.




## జాతీయ ప్రతిభ పురస్కార అవార్డులకు ఎంపికైన నంద్యాల బాల అకాడమీ ఉపాధ్యాయులు.



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): గుంటూరు సదరన్ ప్రవేట్ లెక్చరర్, టీచర్ ఆర్గనైజేషన్, కేవిఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ ప్రవేట్ టీచర్స్, లెక్చరర్ కి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి (టీచర్స్ డే) సందర్భముగా డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభ పురస్కారాలు ప్రకటించనున్నారు. ఈ జాతీయ అవార్డుకు నంద్యాల స్థానిక బాల అకాడమీ రవీంద్ర హై స్కూల్, మ్యాథ్స్ ఉపాధ్యాయులు వి.లక్ష్మీనారాయణ మరియు తెలుగు ఉపాధ్యాయులు యం.సురేష్ బాబు లకు ఈ అవార్డులు అందించనున్నారు. ఈ వేడుక ఈ నెల 31 వ తేదీన గుంటూరు లోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా జాతీయ ప్రతిభ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులను పాఠశాల డైరెక్టర్ శ్రీ యం.జీ.వి. రవీంద్రనాద్, ప్రిన్సిపాల్ శ్రీమతి మాధవిలత మరియు ఉపాధ్యాయులు, విద్యార్ధులు అభినందనలు తెలియజేశారు.

## చింతలపూడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో చేయూత అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన.శాసనసభ్యులు రోషన్ కుమార్

ఏలూరు జిల్లా ప్రతినిధి -ప్రసాద్ (శుభోదయం న్యూస్):
ఏలూరు జిల్లా చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ మంగళవారం రాత్రి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడుని తాడేపల్లి నివాసంలో కలుసుకొని నియోజవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.నియోజకవర్గ రహదారుల అభివృద్ధితోపాటు, చింతలపూడి లో బస్ డిపో ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత గురించి, గ్రామీణ ప్రాంత ప్రజలకు సోలార్ విద్యుత్తు చేరువ చేయడం తదితర అంశాలను ముఖ్యమంత్రి కి వివరించిన ఎమ్మెల్యే రోషన్ కుమార్ఎమ్మెల్యే రోషన్ కుమార్ వివరించిన అన్ని అంశాలను సావధానంగా విని సీఎం చంద్రబాబు నాయుడు అందుకు సానుకూలంగా స్పందించారు.



## బద్వేల్ పట్టణంలో నాలుగు రోడ్ల కూడలిలో కొలువుదీరిన గణనాథుడు

బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ - శివారెడ్డి (శుభోదయం న్యూస్): కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గం లో నాలుగు రోడ్ల కూడలిలో కొలువుదీరిన గణనాథునికి అంగరంగ వైభవంగా గజ మాలలతో పండ్లు ప్రసాదాలతో ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. జై బోలో గణేష్ మహరాజ్ కి అనే నినాదాలతో గణనాథుని పలికారు.. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు సింగంశెట్టి వెంకటసుబ్బయ్య 9వ వార్డు జనసేన ఇంచార్జ్ చిన్ని సుబ్బారావు మొదలైన వారు దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## గోపవరం మండలంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన గణేష్ ఉత్సవాలు

బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండలం రిపోర్టర్ నాగేంద్ర (శుభోదయం న్యూస్ ): కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండలం రసాయిపేట గ్రామంలో అంగరంగ వైభవంగా వినాయకుని ఉత్సవాలు నిర్వహించడం జరిగింది. గణనాథునికి గజమాల వేసి పండ్లు ప్రసాదాలు సమర్పించి పూజలు నిర్వహించారు.. అందరూ ఒక చోటికి చేరుకొని దేవుని సన్నిధిలో నిమగ్నమై ఆ గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. పిల్లలు పెద్దలు ఎంతో ఉత్సాహంతో గణనాథుని వేడుకలు చేసుకున్నారు.



# పూండ్ల బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటాం

### -బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు భరోసా



బాపట్ల జిల్లా, (శుభోదయం న్యూస్) ఆగస్టు 27:
బాపట్ల మండలం పూండ్ల గ్రామంలో చెరువులో పడి ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడిన సంఘటనపై బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు ఈ విషాద సంఘటన తనను కలచి వేసిందని పేర్కొన్నారు. కలువ పూల కోసం చెరువులో దిగి గ్రామానికి చెందిన సైకం నాగభూషణం(17),సుద్దపల్లి శ్రీమంత్(15) అనే విద్యార్థులు మృత్యువాత పడిన సంఘటన హృదయ విచారకరమని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పేర్కొన్నారు. ఈ సంఘటన గుండెల్ని కదిలించేసిందని పేర్కొన్నారు సంతోషంగా పండుగ వేడుకలు జరుపుకుంటున్న తరుణంలో ఈ సంఘటన రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపిందని విచారం వ్యక్తం చేశారు ఆ కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని అన్నారు ఆ కుటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ తరఫున ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. జరిగిన దురదృష్టకర సంఘటనతో తల్లడిల్లి పోతున్న ఆ కుటుంబాలకు కొండంత ధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ తన ప్రగాఢ సంతాపంలో పేర్కొన్నారు.

## డి.వడ్డిపల్లి బీసీ కాలనీ లో భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు

వెంకటగిరి నియోజకవర్గం ఇంచార్జ్ - విసీ సుబ్బరాయుడు (శుభోదయం న్యూస్): తిరుపతి జిల్లా డక్కిలి మండలం డి.వడ్డిపల్లి గ్రామపంచాయతీ బీసీ కాలనీ నందు వినాయక చవితి సందర్భంగా వినాయక స్వామివారి ప్రత్యేక పూజలు గణపతి హోమము శాస్త్రోకంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో వినాయక చవితి సేవ సమితి సభ్యులు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా పురస్కరించుకొని గ్రామ ప్రజలు అందరూ ఆయురారోగ్యాలు ఐశ్వర్యాలు వినాయక స్వామి అనుగ్రహంతో కలగాలని అన్నారు వినాయక చవితికి సహకరించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ట దాత వెలికంటి చెంచుకృష్ణ (తెలంగాణ పోలీస్ )స్వామి వారి కి డెకరేషన్ డి వడ్డీపల్లి యూత్ హెూస్టేర్స్ గ్రూప్ స్వామివారి మండపం ఖర్చు 65000 రూపాయలు వారి కి అదేవిధంగా దాదాపు 1000 మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్న కింగ్ స్టార్ గ్రూప్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## వర్ష ప్రభావం కారణంగా దెందులూరు హైవేపై చాపల లారీ బోల్తా

ఏలూరు జిల్లా ప్రతినిధి -ప్రసాద్ (శుభోదయం న్యూస్ ): వర్షం కారణంగా వేగంగా చేపల లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన ఏలూరు జిల్లా దెందులూరు మండలం విజయవాడ రాజమండ్రి నేషనల్ హైవే గరుడ హెూటల్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గుడివాడ నుండి నారాయణ పురానికి చాపల లోడుతో లారీ బయలుదేరింది. నారాయణపురం లో ఈ చేపలు ప్యాకింగ్ చేయబడి అక్కడినుండి వేరొక రాష్ట్రానికి తరలింపు పడతాయి మార్గమధ్యంలో సరిగా గరుడ హెూటల్ సమీపానికి చేరుకునే సరికి ఈ ప్రమాదం చోటుచేసుకుంది ప్రమాద సమయంలో లారీలో 9 మంది కూలీలు ప్రయాణిస్తున్నారు వారిలో ఒకరు మృతి చెందగా మరో వ్యక్తి తీవ్ర గాయాలు పాలయ్యాడు. క్షతగాత్రుని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు.



# భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## -మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డి

మెదక్ జిల్లా, (శుభోదయం న్యూస్): మెదక్ పుష్పల వాగు నక్క వాగు వద్ద ప్రవహిస్తున్న వరద ఉధృతిని బిఆర్ఎస్ నాయకులతో కలసి పరిశీలించిన మెదక్ మాజీ ఎమ్మెల్యే యం.పద్మ దేవేందర్ రెడ్డి. మంగళవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి ప్రవహిస్తున్న మెదక్ పుష్పల వాగు వరద నీటిని పరిశీలించారు.అనంతరం హవెలి ఘనపూర్ నుండి ఎల్లారెడ్డి వెళ్లే రహదారిలో నక్కవాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో ఒక కారు రోడ్డు దాటే క్రమంలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. ఉధృతంగా ప్రవహిస్తున్న నక్క వాగును పరిశీలించారు.అక్కడున్న మెదక్ ఎస్పీ శ్రీనివాస్ రావుతో మాట్లాడుతు వాగు దాటుతుండగా కారు ఉధృతంగా ప్రవహిస్తున్న వరదలో కొట్టుకపోయింది కారులో ఉన్న వ్యక్తులను కాపాడడానికి సహాయ చర్యలు చేపట్టాలని అన్నారు.ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ మంగళవారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని వాగుల వంకలు అన్ని పొంగిపొర్లుతున్నాయని ప్రజలు ఎవరు బయటకు రాకూడదని అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ప్రవహిస్తున్న వరద ఉధృతిని చూసి లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఎవరు ఉండకూడదని అప్రమత్తంగా ఉండాలన్నారు.సంబంధించిన అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎప్పటికప్పుడు సహాయ చర్యలు తీసుకోవాలని అన్నారు.కురుస్తున్న భారీ వర్షాల వల్ల వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయని ఈ వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎవ్వరు కూడా వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితులలో తప్ప ప్రయాణాలు చేయకూడదని అన్నారు.వర్షాలు కురుస్తాయని



వాతావరణ శాఖ సమాచారం మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ఏదైనా సమస్య ఉంటే అధికారులను సంప్రదించి వారి సూచనలను సహాయ సహకారాలను పొందాలన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలిగే చోట బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండి వారికి సహాయ సహకారాలు అందజేయాలని సూచించారు. వీరితోపాట తదితరులు ఉన్నారు.



# గాండ్ల సంఘం లో ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన.

బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కామారెడ్డి జిల్లా బీర్కూరు మండల కేంద్రం లోని గాండ్ల తెలికుల సంఘం లో ఏకదంతుని రెండవ సారి విగ్రహ ప్రతిష్టాపన కావడంతో గాండ్ల సంఘం సభ్యులు సకుటుంబ సమేతంగా వచి ప్రత్యేక పూజలు చేసి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మండల వ్యాప్తంగా గణనాథుని విగ్రహ ప్రతిష్టాపనలు ఘనంగా నిర్వహించార. గణనాథులను విధుల్లో ఊరేగిస్తూ డీజే చెప్పులు భజంత్రీలతో మండపాలకు చేరుకొని బాణాసంచా కాల్చి విగ్రహాలు ప్రతిష్టించారు. ధూప దీప నైవేద్యాలతో హా ఏకదంతునికి మొదటి పూజలు చేశారు. ఈ కార్యక్రమం లో గాండ్ల సంఘం అధ్యక్షులు సంతోష్ కుమార్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ కుల పెద్దలు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీర్కూర్ పట్టణం లో మట్టి వినాయకుల పంపిణీ.

బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కామారెడ్డి జిల్లా బీర్కూరు మండల పట్టణ కేంద్రం లో లయన్స్ క్లబ్ మరియు శ్రీ రాజరాజేశ్వరి సీడ్స్ ఆధ్వర్యం లో మట్టివినాయకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.





# బండ కిరణ్ యాదవ్ జయంతి సందర్భంగా అన్నదానం

## సోషల్ వర్కర్ గా ఎన్నో సేవా కార్యక్రమాలు జక్కుల మహేశ్వర్ రెడ్డి బోర్డు మాజీ ఉపాధ్యక్షులు



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మటి శివకుమార్, (శుభోదయం న్యూస్) ఆగస్ట్ 27: ప్రముఖ సంఘ సేవకులు బండ కిరణ్ యాదవ్ మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి అన్నారు. బోయిన్ పల్లి ఓల్డ్ ఎయిర్ ఫోర్ట్ రోడ్డులోని తార అనాధ ఆశ్రమంలో బండ కిరణ్ జయంతి సందర్భంగా జక్కుల మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జక్కుల మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... సోషల్ వర్కర్ గా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బండ కిరణ్ యాదవ్ తనకు ఎంతో ఆప్తుడని, వారు మా మధ్య లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ 1వ వార్డు అధ్యక్షుడు నరసింహారావు, మైనారిటీ ప్రెసిడెంట్ హసీన్ ఖాన్, శ్రీనివాస్, నాగరాజు, కంతరాజు, విజయ్ రాము యాదవ్ శ్రీధర్ రిజ్వాన్, ఇమ్రాన్ కిషోర్ యాదవ్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

# విగ్నేశ్వరుడి నవరాత్రి వేడుకలు ప్రారంభం

## -సికింద్రాబాద్ గణపతి ఆలయం రెండు వందల సంవత్సరాల చరిత్ర

## -పూజ కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మటి శివకుమార్, (శుభోదయం న్యూస్) ఆగస్ట్ 27: విఘ్నాలు తొలగించే విగ్నేశ్వరుడి నవరాత్రులను భక్తి శ్రద్దలతో జరుపుకోవాలని, ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని సికింద్రాబాద్ లో 200 సంవత్సరాల చరిత్ర కలిగిన గణపతి ఆలయంలో ఎమ్మెల్యేలు శ్రీ గణేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలుకుతూ, వేద పండితులచే ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ... గణనాథుడి నవరాత్రి వేడుకలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ అధికారులకు, కమిటీ సభ్యులకు సూచించారు. గణపతి ఆలయ అధికారులు మేరకు హాజరైన శ్రీ గణేష్ ను శాలువతో ఘనంగా సన్మానించారు. గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముప్పిడి మధుకర్.సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో ప్రతి సంవత్సరం వినాయక నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముప్పిడి మధుకర్ అన్నారు. గణనాథుడిని భక్తిశ్రద్ధలతో కొలిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని ఆయన అన్నారు.



ఆలయ కమిటీ సభ్యులు ముప్పిడి మధికర్ తో పాటు, జోగుల భాస్కర్ ను ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఆలయ చైర్మన్ అరవింద్ యాదవ్, ధర్మకర్తలు ముఖేష్ యాదవ్, జాజుల క్రాంతి, నరేష్, వందన హరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# మట్టి విగ్రహాలను పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం

## -కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున్





తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మటి శివకుమార్, (శుభోదయం న్యూస్) ఆగస్ట్ 27: భక్తిశ్రద్ధలతో వినాయకుడి నవరాత్రి వేడుకలను ఘనంగా జరుపుకోవాలని, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున్ అన్నారు. బుధవారం వినాయకుడి నవరాత్రి వేడుకలు సందర్భంగా వారు నివాసంలో మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం మట్టి విగ్రహాలనే ఏర్పాటు చెయ్యాలని సూచించారు. కుటుంబ సభ్యులతో కలిసి మొదటి రోజు నవరాత్రి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

# గణపయ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

## -ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మటి శివకుమార్, (శుభోదయం న్యూస్) ఆగస్ట్ 27: గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. బుధవారం ఓల్డ్ బోయిన్ పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి గణనాథునికి పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం గణనాథుడి నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ సతీమణి ముద్దం భాగ్యలక్ష్మి మరియు కుటుంబ సభ్యులతో పాటు, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుర్రి యాదగిరి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఉండండి జిల్లా పాలన యంత్రాంగం అండగా ఉంది

## - : మెదక్ ఆర్డీవో రమాదేవి

మెదక్ జిల్లా, (శుభోదయం న్యూస్): బుధవారం భారీ వర్షాలు నేపథ్యంలో మెదక్ మున్సిపాలిటీ అంబేద్కర్ కాలనీ వార్డ్ నెంబర్ 27లో నీళ్లు చేరిన ఇండ్లను ఆర్డీవో రమాదేవి పరిశీలించారు.

ప్రజలకు పలు సూచన చేస్తూ వాతావరణం ప్రతికూల ప్రభావంతో వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కుడుస్తున్నాయని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు రావద్దని అధికార యంత్రాంగం సహాయక చర్యలు చేపడుతుందని వివరించారు.



# గ్రామాలలో రోడ్ల డ్రైనేజీల సమస్యలను పరిష్కరించాలి

## -గిరిజన సంఘం మండల నాయకులు సందీప్ కుమార్

మంగపేట,మండల రిపోర్టర్– తులసి( శుభోదయం న్యూస్ ):మంగపేట రమణక్కపేట గ్రామంలో ఉన్న రోడ్లు డ్రైనేజీలు వేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు డిమాండ్ చేశారు ఆయన మాట్లాడుతూ రమణక్కపేట గ్రామంలోనే డ్రైనేజీలు రోడ్లు వేయాలని గత నాలుగు ఐదు నెలలకు క్రితం విడిసీలు ఇచ్చిన కానీ రోడ్లు డ్రైనేజీలు వేయడం లేదని గ్రామంలోని వర్షం వస్తే రోడ్లు బురద బురద ఉంటున్నాయని రోడ్లమీదనే నీరు నిల్వ ఉంటుందని అదేవిధంగా డ్రైనేజీలు లేక ఎక్కడ పడిన వాన అక్కడే ఆగిపోతుందని వారన్నారు వీ డీ సీలు తీసుకున్నవారు ఆ రోడ్లు డ్రైనేజీలు పోయకపోతే ప్రజలంతా సమీకరణ చేసుకొని భవిష్యత్తులో పోరాటం చేస్తామని సందర్భంగా అన్నారు



# బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ

## -పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను పూజిద్దాం

తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మటి శివకుమార్, (శుభోదయం న్యూస్), ఆగస్ట్ 27: మట్టి విగ్రహాలను ఇంట్లో పెట్టుకుని పూజించి, పర్యావరణాన్ని రక్షించుకుందామని, బిజెపి పార్టీ రెండో వార్డు అధ్యక్షుడు మందుల శ్రావణ్ అన్నారు. బుధవారం రెండో వార్డు రసూల్ పురా బిజెపి జెండా కంగల్ చౌరస్తా వద్ద, బిజెపి రెండవ వార్డు సభ్యులు మహేష్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల. పంపిణీ కార్యక్రమానికి, మందుల శ్రావణ్ ముఖ్యఅతిథిగా అయ్యారు. ఈ సందర్భంగా మందుల శ్రావణ్ మాట్లాడుతూ... పర్యావరణాన్ని కాపాడడం నేటి యువత చేతిలోనే ఉందని తెలిపారు . రెండవ వార్డులోని అధిక సంఖ్యలో మట్టి విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమని మందుల శ్రావణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు బిజెపి పార్టీ సీనియర్ నాయకులు నాగరాజు, శ్రీశైలం, సతీష్, రవి, శివ, తదితరులు పాల్గొన్నారు.



# గణనాధుని ఆశీస్సులతో మరో 4 యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తా

**-సికింద్రాబాద్ గణపతి ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది -ప్రత్యేక పూజలు చేసిన మాజీమంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు మల్లారెడ్డి**

తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, (శు భోదయం న్యూస్ ),ఆగస్ట్ 27: సికింద్రాబాద్ గణనాధుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని అన్నారు. మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు సి. హెచ్ మల్లారెడ్డి అన్నారు. బుధవారం వినాయక చవితి సందర్భంగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికి, వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... తను చిన్నప్పటినుండి సికింద్రాబాద్ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలకు హాజరవుతారని తెలిపారు. గణనాధుడి ఆశీస్సులతో



మూడు యూనివర్సిటీలను ఏర్పాటు చేశానని, త్వరలోనే జాతీయస్థాయిలో మరో నాలుగు యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నావని గణనాధుని ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, బిఆర్ఎస్ పార్టీ యువ



నాయకుడు టింకు గౌడ్, అజయ్, ఆలయ చైర్మన్ అరవింద్ యాదవ్, ధర్మకర్తలు ముఖేష్ యాదవ్, జాజుల క్రాంతి, నరేష్, మల్లేష్, వందన, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ నవరాత్రులు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

**- బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్**



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,(శుభోదయం న్యూస్), ఆగస్ట్ 27: విఘ్నేశ్వరుడి నవరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. వినాయక చవితి పురస్కరించుకొని బోయిన్ పల్లిలోని బాపూజీనగర్ నల్లపోచమ్మ ఆలయంలో, 6వ వార్డులోని శివపంచాయతన సీతారామాంజనేయ హనుమాన్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్నేశ్వరుడుకి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిధులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ... విఘ్నాలు తొలగించే విగ్నేశ్వరుడి నవరాత్రులను భక్తి శ్రద్దలతో పూజిస్తే ఆటంకాలు తొలగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ ముదిరాజ్, సాయిబాబా యాదవ్, నర్సింహా, నరేందర్, ప్రకాష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల కారణంగా ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండండి- పోచారం శ్రీనివాస్ రెడ్డి

బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు స్థానికంగా అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని కోరిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నదులు, వాగులు, చెరువులు, కల్వర్టులు, బ్రిడ్జిల దగ్గరకు వెళ్ళవద్దు.

అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకండి.

కరంటు స్తంభాలు, వైర్లను ముట్టుకోవద్దు.

చిన్న పిల్లలను ఇంట్లోనే ఉంచండి, బయటకు రానివ్వద్దు.

రైతులు తమ పంట పొలాలలో నిల్వ ఉన్న వర్షపు నీటిని వెంటనే తొలగించండి.

నిజాంసాగర్ ప్రాజెక్టు లోకి పోచారం,ఘనపూర్ ల నుండి భారీగా వరద నీరు వస్తున్నందున 2 లక్షల క్యూసెక్కులకు పైగా అవుట్ ఫ్లో ఉన్నందున మంజీరా నది పరివాహక ప్రాంతం వాళ్ళు అప్రమత్తంగా ఉండాలి.



# రెండు శతాబ్దాల చరిత్రగల గణపతి ఆలయంలో “నవరాత్రులు ప్రారంభం”

**-ప్రత్యేక పూజలు చేసిన ముప్పిడి గోపాల్**





తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, (శుభోదయం న్యూస్), ఆగస్ట్ 27: సికింద్రాబాద్ గణపతి ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది అని, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ తొలి చైర్మన్, ముప్పిడి గోపాల్ అన్నారు. బుధవారం నాడు వినాయక చవితి సందర్భంగా గణనాధుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ముప్పిడి గోపాల్ తో పాటు, దర్గా రవికుమార్ ను ఘనంగా సన్మానించారు. వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ముప్పిడి గోపాల్ మాట్లాడుతూ... రెండు శతాబ్దాల నుండి గణనాధుని ఆలయనికి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, ఈ ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది అని, గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయి తెలిపారు. ఈ కార్యక్రమములో దళిత రత్న అవార్డు గ్రహీత, ఆల్ ఇండియా ఎస్.సిఆర్.పి.ఎస్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ దర్గా రవికుమార్, గణేష్ టెంపుల్ చైర్మన్ అరవింద్ యాదవ్, ఆలయ ధర్మకర్తలు వి. నరేష్, జాజుల క్రాంతి, ముకేష్ యాదవ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# హంద్రీనీవా నీరు జగన్ ఇచ్చారని వైసిపి మాట్లాడ్డం హాస్యాస్పదం.

**- ట్యాంకర్లతో నింపి సెట్టింగ్ లు వేసింది ప్రజలకు అంతా తెలుసు.**

**- అవాస్తవాలు మాట్లాడితే మహిళలు కుప్పం ప్రజలే తరిమి కొడతారు.**

**- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్.**

కుప్పం,ఆగస్టు 27

హంద్రీనీవా కాలువ ద్వారా కుప్పానికి నీరు ఇచ్చింది జగన్మోహన్ రెడ్డి అని వైసిపి నాయకులు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ విప్, కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ విమర్శించారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుప్పం ప్రజలను మోసగించేందుకు ట్యాంకర్లతో నీళ్లు తోలి,సెట్టింగ్లు వేసి నీరు వదిలినట్లు డ్రామాలు ఆడిన విషయం కుప్పం ప్రజలకు బాగా తెలుసు అన్నారు. నీళ్లు వదిలిన కొన్ని గంటలకే నేను ఇంకిపోయిందని, కాంట్రాక్టర్ సెట్టింగ్లను ఎత్తుకెళ్లారని అందరికీ తెలుసు అన్నారు. అవాస్తవాలు మాట్లాడితే కుప్పం నియోజకవర్గం నుండి మహిళలు ప్రజలు తరిమి కొడతారని హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ,అపర భగీరథుడు నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక కృషితో 738 కిలోమీటర్ల దూరం నుంచి 1200 అడుగుల ఎత్తుకు తీసుకువచ్చి కుప్పం లో చిట్టచివరన ఉన్న పరమ సముద్రం చెరువుకు గలగలా పారుతున్న గంగమ్మను తీసుకువచ్చారని కొనియాడారు. ఈనెల 30వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నారా భువనేశ్వరి లు పూజలు జరిపి జల హారతి ఇచ్చి కృష్ణమ్మ జలాలను కుప్పం ప్రజలకు అంకితం చేస్తారన్నారు. గతంలో 13 శాతం పనులు నిలిచిపోయాయని ఆ పనులను పూర్తి చేయక నిర్లక్ష్యం వహించింది ఎవరో ప్రజలకు అంతా తెలుసు అన్నారు. కుప్పం నియోజకవర్గంలో అడ్డుగోలుగా వైసిపి నేతలు దోచుకున్నారని మీరా విమర్శించేది అని నిలదీశారు. 30వ తేదీన జలహారతి కార్యక్రమం అధికారికంగా జరుగుతున్నదని, ఎమ్మెల్సీగా ఉన్న భరత్ కు ఆహ్వానం పంపుతామని ఆయన కూడా 30వ తేదీన వచ్చి కృష్ణా జలాలను తనపై చెల్లుకొని పునీతం కావాలని, హంద్రీనీవా కు కల్పించిన



అవాంతరాలకు ప్రక్షాళన చేసుకోవాలని హితవు పలికారు. కుప్పం నియోజకవర్గంలో హంద్రీనీవా పనులకు అడ్డంకులు సృష్టించింది భరత్ తండ్రి కాదా అని నిలదీశారు. ఈ సమావేశంలో టీటీడీ బోర్డు మెంబర్ శాంతారామ్, కుప్పం అర్బన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజకుమార్, కుప్పం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దామోదరం నాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రతిస్పందించడం శుభ పరిణామం.

కుప్పం,ఆగస్టు 27(

శ్రీశైలం నుంచి కృష్ణమ్మ హంద్రీనీవా కాలువ ద్వారా కుప్పం చేరుకోవడంతో ప్రతిస్పందించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ముందుకు రావడం శుభ పరిణామమని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ విప్, కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ చైర్మన్, కడా సలహా మండలి పొలిటికల్ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు.కుప్పం మున్సిపాలిటీ 8వ వార్డులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది.పరమసముద్రం చెరువుకు కృష్ణమ్మ జలాలు రాకతో ఈ పరిణామం చోటుచేసుకుంది.

కుప్పం బైపాస్ రోడ్ లోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంల బుధవారం మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ డి. సుధీర్, కౌన్సిలర్ గణపతి, సీనియర్ నాయకులు ప్రతాప్ సింహ, మురుగేష్ ల ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ నుండి నుండి పలువురు టీడీపీలో చేరారు. పరమసముద్రం, పల్లార్లపల్లి గ్రామాలకు చెందిన 50 మందికి ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం లు కండువా కప్పి సాధరంగా పార్టీలోకి ఆహ్వానం పలికారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, కుప్పం అర్బన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ డి. సుదీర్ లు ప్రసంగించారు. రాష్ట్రంలో కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల విషయంలో వాస్తవాలను అందరూ గ్రహించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి చెందాలన్నా, కుప్పం అభివృద్ధి పథంలో సాగాలన్నా అది చంద్రబాబుకే సాధ్యమన్నారు. కుప్పం నియోజకవర్గం లో ఇతర పార్టీలకు చెందిన వారు టిడిపిలోకి రావాలని చంద్రబాబు నాయకత్వాన్ని బలపరిచి కుప్పంలో మరింత అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లేందుకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి తెలుగుదేశం పార్టీ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో పల్లర్లపల్లి శ్రీనివాసులు, మునిరాజు, చిట్టి, వెంకటేష్, తదితరులు



తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు.

కార్యక్రమంలో కడా సలహా మండలి సభ్యులు రాజకుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ డి. సుధీర్, టిడిపి నాయకులు ప్రతాప్సింహ, మురుగేష్, క్లస్టర్ ఇంచార్జ్ మాణిక్యం, 8వ వార్డు పార్టీ అధ్యక్షులు తిమ్మరాజు, మాజీ పార్టీ అధ్యక్షులు మధు, జగన్, రమేష్, పార్టీ విస్తరణ విభాగం నాయకులు కె. కన్నన్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ముగం,తదితర నాయకులు పాల్గొన్నారు

# కుప్పంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు.

**- వాడవాడల్లో భారీ విగ్రహాల ఏర్పాటు.-వరసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు.**

కుప్పం,ఆగస్టు 27 కుప్పం పట్టణంలో వినాయక చవితి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం వినాయక చవితిని పురస్కరించుకొని ఇంటింటా భక్తిశ్రద్ధలతో వినాయక వ్రతాన్ని ఆచరించారు. కుప్పంలోని ముఖ్యమైన చోట్లలో చూపరులను ఆకట్టుకునే రీతిలో అతి భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కుప్పం కొత్తపేటలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు, అలంకరణ, మహా మంగళహారతి నిర్వహించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. పలువురు ముఖ్యమైన అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు వాడల్లో వెలసిన వినాయక ప్రతిమలను దర్శించుకున్నారు.



## మాజీ మంత్రివర్యులు కాకాని గోవర్ధన్ రెడ్డి పూజితమ్మను కలిసిన అక్కపేట వై.కా.పా నాయకులు..

**దండు అమర్ రెడ్డి నాయకత్వంలో బాసటగా నిలిచిన నేతలు.**



మనుబోలు(.27.8.2025.)
మండలంలోని అక్కంపేట గ్రామ వైకాపా నేతలు నెల్లూరు వెళ్లి నెల్లూరు జిల్లా వైకాపాఅధ్యక్షులు మాజీ మంత్రివర్యులు కాకాని గోవర్ధన్ రెడ్డి గారిని.రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ అధ్యక్షురాలు రాష్ట్ర మాజీ మంత్రివర్యులు కాకాని గోవర్ధన్ రెడ్డి కుమార్తె కాకాని పూజితమ్మ ను కలుసుకున్నారు. అక్కంపేట వైకాపా యువనేత దండు అమర్ రెడ్డి నాయకత్వంలో కాకాని గోవర్ధన్ రెడ్డిని పూజితమ్మ ను కలుపుకుని పూలమాలవేసి శాలువా కప్పారు. ఈ సందర్భంగా అక్కంపేట వైకాపానేత దండు అమర్ రెడ్డి కొత్త వారిని పరిచయం చేశారు. తాము మీకు బాసటగా ఉంటామని చెప్పారు. అనంతరం గోవర్ధన్ రెడ్డి పూజితమ్మ మాట్లాడుతూ ఇంత దూరం వచ్చి తమకు ధైర్యం చెప్పిన అక్కంపేట నేతలకు ధన్యవాదాలు చెప్పారు. మీకు ఏ అవసరం వచ్చినా తన దగ్గరకు రావాలని మీకు తమ సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో అక్కంపేట వైకాపా నాయకులు దండు అమర్ రెడ్డి.పల్లం రెడ్డి శ్రీహరి రెడ్డి.(హరి బాబు) అంబటి శేషు రెడ్డి. అంబటి శ్రీనివాసులు రెడ్డి. చిల్లకూరు వెంకు రెడ్డి. తాటిపర్తి సతీష్ రెడ్డి. గిద్దంటి శ్రీనివాసులు.రాపూరు ఓబయ్య. కంద్రాతి శ్రీనివాసులు.మురళి తదితరులు పాల్గొన్నారు

## పురవీధుల్లో ఊరేగిన విగ్నేశ్వరుడు:



కార్వేటినగరం( కార్వేటినగరం మేజర్ పంచాయతీ నగరం చెరువు వద్ద వెలసిన శిష్టా సౌందర్యవల్లి సమేత సదాశివ స్వామి ఆలయం ఆవరణలో ఉన్న వినాయక చవితి సందర్భంగా విగ్నేశ్వరుని అభిషేకం ప్రత్యేక పూజలు



నిర్వహించారు. ఉదయం స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు భక్తులు కర్పూర హారతించి మొక్కులు తీర్చుకున్నారు. రాజా వీధిలో ఉన్న విఙ్నేశ్వర ని ఆలయం ప్రతివీధిలోను వినాయకుని ప్రతిమలు ఏర్పాటు చేశారు భక్తులు హారతి నుంచి మొక్కులు తీర్చుకున్నారు. ఈ చవితి పర్వదినాన గణనాథుని ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని, ఆయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధించాలని, సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఆ విఘ్నేశ్వరుడి దయతో అన్ని విఘ్నాలు తొలగిపోయి, ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, విజయాలు సిద్ధించాలని, గణనాథుని కరుణా కటాక్షాలతో ప్రతీ కుటుంబం సుఖ సంతోషాలతో అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ అభిలాషించారు.వినాయకచవితి పండుగ సందర్భంగా గంగాధర నెల్లూరు నియోజకవర్గ ప్రజలకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



# పిడూరు మిక్సిడ్ కాలనీలో వినాయక చవితి వేడుకలు.

మనుబోలు. 27.8.2025. మండలంలోని పిడూరు మిక్సిడ్ కాలనీలో బుధవారం ఉదయం వినాయక చవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. వినాయక చవితి పండుగను పునస్కరించుకొని రచ్చబండ వద్ద 12 అడుగుల వినాయకుడి బొమ్మను ఏర్పాటు చేసుకున్నారు. పూజారి గణపయ్యకు పూజలు చేశారు. చుట్టుపక్కల కుటుంబాల వారి సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం గణేశుడికి మొక్కులు తీర్చుకున్నారు. వినాయకుడికి ఇష్టమైన పిండి వంటలు. కుడుములు సమర్పించారు. ప్రతి సంవత్సరం వినాయక చవితికి ఇలాగే జరుపుకుంటామని నిర్వాహకులు చెప్పారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు గజ్జల హరి మాట్లాడుతూ మిక్సిడ్ కాలనీలో పార్టీలు కులాలు మతాలు లేకుండా అందరూ కలిసికట్టుగా వినాయక చవితి పండుగను జరుపుకుంటామని తెలిపారు. 12 అడుగుల బొమ్మను పెట్టుకుని వినాయక చవితి పండుగను నిర్వహించామని తెలిపారు. నిమజ్జనం అయ్యేంతవరకు ఇక్కడ అందరూ భక్తిశ్రద్ధలతో పూజలు పునస్కారాలు అన్నదాన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. వినాయక చవితి రోజు కమిటీ అధ్యక్షులు గజ్జలహరి మోచర్ల రాజేష్ మోచర్ల రమణయ్య వేగూరు మౌళి. మోచర్ల పునీత్. మోచర్ల చరణ్ గజ్జల బాలరాజు నన్నం వెంకటేష్ నన్నం వంశీ.నన్నం వినోద్.ఎం వెంకటేశ్వర్లు ఎం శ్రీహరి జి సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగావినాయక నిమజ్జనం చేసేందుకు ఎస్సై నాగబాబు సారధ్యంలో నిమగ్నమైన వాకాడు పోలీస్ యంత్రాంగం



కోట ఆగస్టు 27
ప్రశాంతమైనవాతావరణంలోవినాయక నిమజ్జనానికి విచ్చేసే వారికి రెవెన్యూ శాఖ ను సమన్వయం చేసుకుంటూ సబ్ ఇన్స్పెక్టర్ నాగబాబు తూపిలి పాలెం సముద్ర తీరాన తగు ఏర్పాట్లు చేయడం జరిగింది. గూడూరు డిఎస్పి గీతా కుమారి ఆదేశాల మేరకు తుపిలిపాలెం నందు వినాయక చవితి ఉత్సవ నిమజ్జన కార్యక్రమాలను మండల సబ్ ఇన్స్పెక్టర్ పి నాగబాబు ఎప్పటికప్పుడుసమీక్షిస్తున్నారు.ప్రజలకు ఆటంకం లేకుండా ఆహ్లాదకరమైనవాతావరణాన్ని ఏర్పరిచేందుకు సిబ్బంది ద్వారా, గ్రామ ప్రజల సహాయంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.నిమజ్జనానికి విచ్చేసేవారు మద్యం సేవించకుండా జాగ్రత్తగా రావాలని నిమజ్జనానికి వచ్చి అధికారుల సూచనలను పాటిస్తూ,ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జనం చేసి సంతోషంగా తిరిగి వెళ్లాలని ఎస్సై నాగబాబు ప్రజలను కోరారు.

# వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



నారాయణ వనం ఆగస్టు 27( సత్యవేడుఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సొంత మండలం అయిన నారాయణవనం లో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్నారు.ఉదయం గణనాథుని ఏర్పాటు చేసిన మండపానికి ఎమ్మెల్యే చేరుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.నిర్వాహకులు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆలయ మర్యాదలు చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే ఆది మూలం మాట్లాడుతూ ఈ చవితి పర్వదినాన గణనాథుని ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని, ఆయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధించాలని, సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఆ విఘ్నేశ్వరుడి దయతో అన్ని విఘ్నాలు తొలగిపోయి, ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, విజయాలు సిద్ధించాలని, గణనాథుని కరుణా కటాక్షాలతో ప్రతీ కుటుంబం సుఖ సంతోషాలతో అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే ఆదిమూలం అభిలాషించారు.వినాయకచవితి పండుగ సందర్బంగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నియోజకవర్గ ప్రజలకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు వినాయకచవితి శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.





## నూతన అన్నదాన భవనాన్ని ప్రారంభించిన రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి..

ఐరాల ఆగస్టు 27
కాణిపాకంలో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి వేడుకలకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కె. మురళీమోహన్, చిత్తూరు ఎమ్మెల్యే



గురజాల జగన్మోహన్ ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తరువాత మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలతో కలిసి నూతనంగా నిర్మించిన అన్నదాన భవనాన్ని ప్రారంభించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన నిత్య అన్నదాన సత్రంలో ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ... భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్నదాన భవనాన్ని ఆధునికంగా నిర్మించామన్నారు. అన్నదానం మరింత విస్తృత స్థాయిలో జరిగేలా అన్ని చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు మరియు నాయకులు, కార్యకర్తలు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## వినాయక స్వామి ప్రత్యేక పూజలో... మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి,



శ్రీకాళహస్తి ఆగస్టు 27 పట్టణంలో దుర్గా మిట్ట వీధిలో రవి గౌడ్, సాధనమున్న రాయల్, మునికృష్ణ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పూజ కార్యక్రమంలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని, అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు,ఈ కార్యక్రమంలో శ్రీవారి సురేష్,ఉత్తరాది శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్,పటాన్ ఫరీద్, గోర,బుల్లెట్ జయ శ్యామ్, మొగరాల గణేష్, ఆవుల శ్రీనివాసులు,కృష్ణ, గంగాధరం, కంద్రిగ భాస్కర్ ,సూర్య,రవి, ప్రశాంత్,హరి, చిన్నోడు, ఢిల్లీ బాబు, చైతన్య, శశి, గణేష్, భూషణం, హేమంత, శివ, సాగర్,జయ కృష్ణ, జీవీకే రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన రాష్ట్ర మంత్రిఆనంరామనారాయణరెడ్డి



కాణిపాకం ఆగస్టు 27 కాణిపాకం స్వయంవరం శ్రద్ధ వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వినాయక చవితితో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలకు సాంప్రదాయాల ప్రకారం ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిఆనంరామనారాయణరెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్. ఈ ఓ పెంచల కిషోర్.దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్. జడ్పీటిసి సుచిత్ర. ప్రజా ప్రతినిధులు మంత్రిత్వపాటు స్వామివారి సేవలో పాల్గొన్నారు

## బీసీ కాలనీలో భక్తిశ్రద్ధలతో వినాయక చవితి. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం.- నేడు అన్నదానం.

మనుబోలు. 27.8.2025. ) స్థానిక కోదండరాంపురం బి. సి కాలనీలో బుధవారం వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పొదలకూరు నుండి పది అడుగుల గణేష్ విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేసుకున్నారు. పూజారి గందల శ్రీనివాసులు వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు నిమజ్జనం అయ్యేంతవరకు ప్రతిరోజు స్వామివారికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని నిర్వకుడు పి.పవన్ తెలిపారు. ఇక్కడ గురువారం అన్నదానం చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు



తాళ్ల నాగరాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పవన్ మాట్లాడుతూ వినాయక బొమ్మను డొనేషన్ చేసిన దాతలు పెంచలయ్య కుటుంబానికి ధన్యవాదాలు చెప్పారు. కమిటీ సభ్యులు చిత్తూరు వేణు రెడ్డి ఎస్ బాబు చల్లా వెంకటేశ్వర్లు కావేటి పెంచలయ్య పి పవన్ ఎన్ శ్రీధర్ ఎన్ సాయి ఆధ్వర్యంలో వినాయక చవితిని జరుపుకున్నారు.



## ఉప రాష్ట్రపతి అభ్యర్థి సి పి రాధాకృష్ణన్‌కి స్వాగతం పలికిన... కోలా ఆనంద్,

శ్రీకాళహస్తి ఆగస్టు 27 తిరుమల పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిసి పి రాధాకృష్ణన్, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ,భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పార్టీ కార్యకర్తలతో కలిసి రేణిగుంట విమానాశ్రయం నందు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ స్వాగతం పలికి వారికి ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బి డి బాలాజి, డాక్టర్ నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రహ్మణ్యం రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, మండల అధ్యక్షులు సీనియర్ నాయకులు వేదం కృష్ణయ్య,తదితర నాయకులు పాల్గొన్నారు.

## హంద్రీ నీవా కాలువలో వినాయక విగ్రహాల నిమజ్జనం వద్దు.

### - కుప్పం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పార్థసారధి.

కుప్పం, ఆగస్టు 27



కుప్పం నియోజకవర్గంలో ప్రవహిస్తున్న హంద్రీనీవా కాలువలోని జలాలలో వినాయక విగ్రహాలను ఎవరు నిమజ్జనం చేయరాదని కుప్పం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు ఓ ప్రకటనలో తెలిపారు.కుప్పం నియోజకవర్గ అవసరాల నిమిత్తం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో, ప్రస్తుతం శ్రీశైలం నుండి కుప్పం పరిధిలోని పరమ సముద్రం చెరువు వరకు హంద్రీనీవా కాలువ ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతూ ఉన్నదన్నారు.ఇదే సమయంలో వినాయక చవితి సందర్భంగా ప్రతిష్టించబడిన వినాయక విగ్రహాల నిమజ్జనాలు త్వరలో ప్రారంభం కానున్నాయి.అందువల్ల భక్తులు మరియు ప్రజలు మీరు ప్రతిష్టించిన గణేష్ విగ్రహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ హంద్రీనీవా కాలువలో నిమజ్జనం చేయరాదన్నారు.కాలువలో నిమజ్జనం జరిపితే నీటి ప్రవాహం ఆగిపోవడం లేదా అవాంఛనీయ సంఘటనలు జరిగే ప్రమాదం ఉన్నదన్నారు.కనుక ప్రజలందరూ వారి వారి పరిసరాలలో ఉన్న చెరువులు, గుంతలు, బావులు వంటి సరియైన ప్రదేశాల్లోనే నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు.ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకుని వినాయక నిమజ్జనాలు చేసుకొని, సుఖసంతోషాలతో పండుగను జరుపుకోవాలని కోరారు

## నేడు మార్కెట్ కమిటీ డైరెక్టర్గా వడివేలు ప్రమాణ స్వీకారం.

కుప్పం,ఆగస్టు 27 :




కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్గా నేడు గురువారం పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు కుప్పం రూరల్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వడివేలు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ నాయకులు, భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆశీస్సులతో రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో తనను కుప్పం మార్కెట్ కమిటీ డైరెక్టర్గా ఎన్నిక చేసిన జిల్లా పార్టీ మరియు ఎన్డీఏ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు డైరెక్టర్లతో కలిసి ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు కుప్పం చెరువు కట్ట పైనుండి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి ప్రమాణస్వీకారం చేయబడునని, కనుక రైతులు, పార్టీ సీనియర్ నాయకులు, హాజరై ఆశీర్వాదం ఇవ్వాలని కోరారు.

## 30 సీఎం చంద్రబాబుచే జల హారతికి తరలిరండి.

### -ఇంటింటికి చంద్రబాబు తరపున ఆహ్వాన పత్రం.

కుప్పం,ఆగస్టు 27 జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులచే ఈనెల 30వ తేదీన కృష్ణమ్మ జలాలకు జరహారతి కార్యక్రమం జరుగుతుందని ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఈనెల 30వ తేదీన హంద్రీనీవా కాలువ ద్వారా శ్రీశైలం నుండి కుప్పం చేరుకున్న కృష్ణమ్మ జలాలకు పరమ సముద్రం వద్ద ముఖ్యమంత్రి జల హారతి ఇస్తున్నారు. దీంతో కుప్పం నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరినీ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు.




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సహకారంతో ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, రాష్ట్ర పార్టీ నాయకులు డాక్టర్ బి.ఆర్. సురేష్ బాబు, ఆయా మండల పార్టీ అధ్యక్షులు రాజకుమార్ బాబు నాయుడు ప్రేమ్ కుమార్ విశ్వనాథ నాయుడు ఆనంద రెడ్డి లతో పాటు ప్రధాన నాయకుల సూచనలతో పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. జల హారతి తో పాటు బహిరంగ సమావేశం ఉంటుందని కుప్పం ప్రజల గుండెల్లో కొలువైన నాయకుడు అపర భగీరథుడు నారా చంద్రబాబు నాయుడు ఆశీర్వదించేందుకు నియోజకవర్గ పరిధిలోని ప్రజలంతా తరలి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రాలు పంపిణీ చేస్తున్నారు. కుప్పం కొత్తపేటకు చెందిన కే కన్నన్ ఆధ్వర్యంలో స్వయంభు అభయ ఉద్భవ గణపతి ఆలయంలో పత్రికలకు పూజలు నిర్వహించారు అనంతరం ఆహ్వాన పత్రాల పంపిణీ ప్రారంభించారు.



## గుడిపల్లి గ్రామంలో భక్తి శ్రద్ధలతో చవితి వేడుకలు




ఐరాల ఆగస్టు 27

వినాయక చవితిని పురస్కరించుకొని బుధవారం భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యూత్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చవితి పర్వదినాన గణనాధుని ఆశీస్సులు గ్రామంలోని ప్రజలందరికీ ఉండాలని, ఆయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధించాలని, సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఆ విఘ్నేశ్వరుడి దయతో అన్ని విఘ్నాలు తొలగిపోయి, ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, విజయాలు సిద్ధించాలని, గణనాధుని కరుణా కటాక్షాలతో ప్రతీ కుటుంబం సుఖ సంతోషాలతో అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు వారు తెలిపారు.

అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లడ్డు ప్రసాదాన్ని అదే గ్రామానికి చెందిన లోకేష్ 3116 రూపాయలకు కైవసం చచేసుకున్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదాన ప్రసాదాలు అందజేశారు. ఈ పూజా కార్యక్రమాలకు గ్రామంలోని పెద్దలు, యూత్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## రేణిగుంట ప్రెస్ క్లబ్‌లో వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు

**భక్తితో సేవా మంత్రం - జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం**




రేణిగుంట

రేణిగుంట ప్రెస్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. నూతనంగా ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్ కార్యాలయంలో వినాయకుని ప్రతిమను ప్రతిష్టించి సభ్యులు భక్తిపూర్వకంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రార్థనలు చేసి, భవిష్యత్తులో రక్త దానం, ఆరోగ్య శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలను క్లబ్ ఆధ్వర్యంలో చేపడతామని సభ్యులు తెలిపారు. భక్తి, సేవా స్ఫూర్తి కలిసిన ఈ వేడుకలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సభ్యులు పాల్గొని ఐక్యతను ప్రతిబింబించారు.

## మహారాష్ట్ర గవర్నర్ సి.పి రాధాకృష్ణన్ కు ఘన స్వాగతం

రేణిగుంట

తిరుమల శ్రీవారి దర్శనార్థం బుధవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న మహారాష్ట్ర గవర్నర్, ఎన్ డి ఏ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి శాలవత సన్మానించి ఘనంగా స్వాగతం పలికారు.



విమానాశ్రయంలో ఆయనకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ, జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ చైర్మన్ రవి నాయుడు, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాసులు, ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, శ్రీకాళహస్తి టీడీపి ప్రతినిధి చెంచయ్య నాయుడు గవర్నర్ కి శ్రీకాళహస్తి కలంకారి చిత్రపటాన్ని అందజేశారు.



## కూటమి ప్రభుత్వం విజయానికి 80 కేజీల లడ్డు ప్రసాదాన్నిసమర్పించిన రామినేని రాము

కాణిపాకంఆగస్టు27( రాష్ట్రంలోకూటమి ప్రభుత్వం విజయం సాధించినందుకుముఖ్యమంత్రిగాచంద్రబాబునాయుడు.చిత్తూరు ఎమ్మెల్యేగా గురజాల జగన్మోహన్ విజయం సాధించినందుకు చిత్తూరు తెలుగుదేశం నాయకులు రామినేని రాము కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామికి బుధవారం 80 కేజీల భారీ సమర్పించి తమ మొక్కనుతీర్చుకున్నారు.ఈ లడ్డును ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చేతుల మీదుగా భక్తులకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో తెదేపా నాయకులు వసంత కుమార్, ఈశ్వర్, నీరజాక్షి నాయుడు. త్యాగరాజన్.తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు ప్రజలకుమట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



చిత్తూరు ఆగస్టు 27) )వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని బుధవారం చిత్తూరు నగరపాల సంస్థ 42వ వార్డు గాంధీ రోడ్డులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రజలకుమట్టి విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఇంట్లోమట్టివినాయకుడితోపూజలుచేసుకోవాలన్నారు.విఘ్నాలను తొలగించి విజయాలను అందించే వినాయకస్వామినిభక్తిశ్రద్ధలతోపూజించాలన్నారు కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజులు, కార్పొరేటర్ శశి కుమార్, స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు

## కాకానిని కలిసి వినాయక చవితి శుభాకాంక్షలు చెప్పిన ఆవుల తులసి యాదవ్ కుటుంబం...

### - మీరే మా దైవం.. తులసి యాదవ్.



మనుబోలు పెద్దలు నా తండ్రిసమానులు, నా రాజకీయ గురువు, నాకు ఎంతో ఇష్టమైన మాజీ%ఎ% మంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్న గారిని నెల్లూరు లో ఇంటి వద్ద కుటుంబ సమేతం గా బుధవారం కలిసి కాకాణి గారికి వినాయకచవితి శుభాకాంక్షలు తెలపడం జరిగింది వినాయకుని ఆశీస్సులు కాకాణి గారికి వారి కుటుంబానికి ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగ వారి ఇంట్లో బిడ్డ లాగా కోరుకుంటున్నాను, 2029 ఎలక్షన్ లో మరల అత్యధిక మెజారిటీతో గెలుపొంది మంత్రివర్యులు అవుతారని మనస్ఫూర్తిగ కోరుకుంటున్నాను జై కాకాణి అన్న, జై జై కాకాణి అన్న మీ రాంబంటు ఆవుల తులసి రామ్ యాదవ్ సోషల్ మీడియా స్టేట్ జాయింట్ సెక్రటరీ

## కాణిపాకం వరసిద్ధిని సేవలో మంత్రి ఆనం నారాయణరెడ్డి. కలెక్టర్.ఎమ్మెల్యేలు

కాణిపాకం ఆగస్టు 27( గరుడ దాత్రిన్యూస్,)కాణిపాకంవరసిద్ధ వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి. కలెక్టర్.సుమిత్కుమార్.ఎమ్మెల్యేలుమురళిమోహన్.గురజాల జగన్మోహన్.ఎండోమెంట్ కమిషనర్ రామచంద్ర మోహన్. ఆర్ జె సి చంద్రశేఖర్ ఆజాద్. ఈవో పెంచల కిషోర్ దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు

